కార్యకర్తలకు అండగా
బీఆర్ఎస్

బొంరాస్‌పేట్, మార్చి 4 : బీఆర్ఎస్ పార్టీ.. కార్యకర్తలకు అండగా ఉంటుందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. దుద్యాల మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ లగచర్ల నరేశ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బండప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు వచ్చినా భయపడొద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని బండ ప్రకాశ్ సూచించారని నరేశ్ తెలిపారు.

రేపు జాబ్ మేళా

- వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగ ఖాళీలు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్

వికారాబాద్, మార్చి 4 : పట్టణంలోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కంపెనీలో 200 అసెంబ్లింగ్ అసిస్టెంట్స్, ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. యువతీ, యువకుల వయస్సు 18 ఏండ్లు నిండి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి (పాస్ లేదా ఫెయిల్)విద్యార్హత ఉండాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడేండ్ల జైలు

చేవెళ్ల రూరల్, మార్చి 4 : పోక్సో కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా పాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు ఏడేండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. మోకిలా పోలీసులు తెలిపిన వివరాలు.. శంకర్‌పల్లి మండల పరిధిలోని ఇర్రుకుంట తండా గ్రామానికి చెందిన విశ్లావత్ రాము ఓ బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో 2019లో సైబరాబాద్ పోలీసులు పోక్సో చట్టం కేసు నమోదు చేశారు. అన్ని ఆధారాలు సేకరించి ఎల్‌బీ నగర్‌లోని రంగారెడ్డి జిల్లా పాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం జడ్జి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత.. నిందితుడికి ఏడేండ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా జైలు శిక్ష విధించనున్నట్లు ప్రకటించారు. అంతేకాదు బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు.

ఎల్ ఆర్ఎస్ ఇక సులభతరం

- నూతన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం
- ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి.. క్రమబద్ధీకరణ చేసుకోవాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అధికారులతో సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 4 : ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకున్నదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి, క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. మంగళవారం వికారాబాద్ సమీకృత కార్యాలయ సమావేశం హాలులో ఎంపీలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించే వాటికి మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుంలో 25శాతం మినహాయింపు ఉంటుందన్నారు. అర్బన్, రూరల్, గ్రామ పంచాయతీల్లో లే అవుట్ రెగ్యులరైజేషన్ 25 శాతం స్కీంపై అవగాహన కల్పించాలని సూచించారు.

క్రమబద్ధీకరణ తప్పనిసరి

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 25శాతం రాయితీ పొందాలన్నారు. 2020 ఆగస్టు 26 వరకు 10శాతం ప్లాట్లు విక్రయించిన లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సబ్ రిజిస్ట్రర్ ద్వారా నిర్ణీత నమూనాలో సేకరించిన దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి, క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. మున్సిపల్, కలెక్టరేట్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రమబద్ధీకరించని భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతించమన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, బలరాం నాయక్, వెంకటయ్య, విక్రం సింహారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ఎంపీలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మెనూ పాటించాల్సిందే..

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- కమ్మదనం గురుకులంలో ఆకస్మిక తనిఖీ

షాద్‌నగర్‌రూరల్, మార్చి 4 : విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురకులంలోని వంటగది, తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థినిలకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, నాణ్యమైన బోజనం, అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు బోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. గురుకులంలో వసతులు, విద్యా బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకుల వంటగది మరమ్మతులు, ప్రహరీ నిర్మించాలంటు తహసీల్దార్‌కు సూచించారు. విద్య, భోజనం, ఇతర వసతుల వివరాలను కలెక్టర్ ప్రధానోపధ్యాయురాలు విద్యులతను అడిగి తెలుసుకున్నారు.

టీ-ఫైబర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి
- హాజిపల్లిలో ఆకస్మిక తనిఖీ

టీ-ఫైబర్ సేవలను పరిశీలిస్తున్న సీఎం ప్రత్యేక కార్యదర్శి

షాద్‌నగర్‌రూరల్, మార్చి 4: టీ-ఫైబర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామాన్ని ఆయన ఐఏఎస్, ఐటీఈ అండ్ సీ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ భవేస్ మిశ్రా, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గామంలోని టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలతో పాటు పాఠశాలను పరిశీలించారు. హాజిపల్లిని టీ-ఫైబర్ ఫైలట్ గ్రామంగా గుర్తించి ఇక్కడి ప్రజలకు అందిస్తున్న ఇంటర్‌నెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో మొత్తం 242 కుటుంబాలు ఉన్నాయని, వీరిలో 182 కుటుంబాలకు ఈ సేవలను అందించనున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలను ప్రజలకు మరింత మెరుగుపరిచేందుకు ఇంటింటికీ ఇంటర్‌నెట్ సేవలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. యువత, ప్రజలు హైస్పీడ్‌తో వస్తున్న టీ-ఫైబర్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు టీ-ఫైబర్ సేవలతో వస్తున్న పాఠ్యాంశాలు, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ టీవీలే కాకుండా పురాతన టీవీలోనూ ఈ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీవో సురేశ్‌మోహన్, ఆర్డీవో సరిత, తహసీల్దార్ పార్థసారధి, మండల విద్యాధికారి మనోహర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే ముఖ్యం

- డీఈవో రేణుకాదేవి, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీదేవి
- కేజీబీవీని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

వసతి గృహం వెనుకాల పరిసరాల శుభ్రతను పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట, మార్చి 4 : వసతి గృహాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని డీఈవో రేణుకాదేవి, గర్ల్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ వసతి గృహంలో రాత్రి సమయంలో విద్యార్థినులపై ఎలుకలు దాడి చేసిన ఘటనపై మంగళవారం జిల్లా అధికారులు సందర్శించారు. ఎలుకల దాడికి గురైనా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై వారు ఆరా తీశారు. ఇక ముందు ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్‌వో శ్రీలతకు సూచించారు. వసతి గృహం పరిసరాలు, స్టోర్‌రూమ్, వారి దుస్తులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. వసతి గృహం ఆవరణలో క్రిమి కీటకాల నివారణకు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసేందుకు పులు మామిడి గ్రామానికి చెందిన రత్నమ్మోళ్ల రవీందర్ రెడ్డి ముందుకొచ్చారు. సొంత ఖర్చులతో శుభ్రత పనులు చేయించడంతో అధికారులు ఆయనను అభినందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ సందర్శించి ఎలుకల దాడి ఘటన వివరాలను ఎస్‌వో శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, వసతి గృహ పరిసరాల శుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని ఎస్‌వో శ్రీలత అధికారులు, ప్రజాప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో రహ్మన్, ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ జయరాం, ఏఎంసీ చైర్మన్ గీతా సింగ్, వైస్ చైర్మన్ మాలీస్ బల్వంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, ఖదీర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చేగూరి మహేశ్ కలిశారు. మంగళవారం సాయంత్రం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను, కడ్తాల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో హెచ్‌ఆర్ మహేశ్, యువ నాయకుడు రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

- కడ్తాల్, మార్చి 7

విద్యాశాఖకు మంత్రి ఉన్నారా?

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

వికారాబాద్, మార్చి 4 : తెలంగాణలో విద్యా శాఖకు మంత్రి ఉన్నారా అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో కొత్తగడి గురుకుల పాఠశాలలో టీచర్ల వేధింపులు భరించలేక 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. తరచూ టీచర్ వేధింపులతో మనోవేదనకు గురైన విద్యార్థిని తబిత పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకడంతో ఎడమ కాలుకు ఫ్రాక్చర్ అయ్యిందన్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 250 మందికిపైగా విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ ఫిబ్రవరి 24న నలుగురిని ఎలుకలు కరువగా, 27న మరో నలుగురిని కరిచాయని తెలిపారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో స్థలం లేదన్నారు. ఇరుకు గదుల్లో నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు కరిచాయన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణమైపోయాయని మండిపడ్డారు. ఒక వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడమంటే అక్కడ ఉన్న పరిస్థితి మనం అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి ఘటనలు మిగతా విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు విద్యార్థుల మానసిక స్థితిని గమనించడానికి, సరైన సమయంలో దిశా నిర్దేశం చేయడానికి కౌన్సిలర్లను నియమించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చన్నారు. తెలంగాణలో కల్తీ లేని ఆహారం కోసం విద్యార్థులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ప్రదేశాల్లోని వసతి గృహాల్లో పిల్లలు పాములు, తేళ్లు, ఎలుకల కాటుకు గురవుతూనే ఉన్నారని పేర్కొన్నారు. అన్నం కోసం కిలోమీటర్ల దూరం నడుస్తున్నా... ఇలాంటి ఘటనలు చూసినా ప్రభుత్వంలో చలనం మాత్రం రావడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని పలు వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు దవాఖాన పాలైన ఘటన లాంటి ఎన్నో ఘటనలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నాయకులు ఎన్ని సార్లు విద్యార్థుల సమస్యలను లేవనెత్తిన... విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వానికి ఎన్నిసార్లు సమస్యల మీద తమ గోడు వినిపించినా స్పందన లేక పోవడం బాధాకరమన్నారు. విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రంలో విద్యావ్యవస్థ మొత్తం నిర్వీర్యం అయిపోతుందన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

లోక్ అదాలత్‌లో 134 కేసులు పరిష్కారం

చేవెళ్లటౌన్, మార్చి 4 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపరాదని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివ రావు తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని జూనియర్ సివిల్ కోర్టు అవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం సటరీత్యా నేరమన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 134 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చంద్ర నాయక్, పోలీసులు సిబ్బంది, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేసులను పరిష్కరిస్తున్న రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

మంత్రులు వస్తున్నారని.. చకచకా పనులు

- ప్రభుత్వ దవాఖానలో ఆగమేఘాలపై పారిశుధ్య పనులు
- పేరుకుపోయిన చెత్త తొలగింపునకు అధికారుల చర్యలు

మంత్రులు వస్తున్నారనే సమాచారంతో ఆస్పత్రి ఆవరణలో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మార్చి 4 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటిస్తున్నారని తెలిసి పారిశుధ్య పనులను చకచకా చేపట్టారు. చెత్తను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటిస్తున్నారన్న సమాచారంతో ఉదయం 4 గంటల నుంచే మున్సిపల్, ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు చకచకా పారిశుధ్య పనులు చేపట్టారు. గత ఏడాది కాలంగా ఈ ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించేందుకు కూడా ఆసక్తి చూపని మున్సిపల్ అధికారులు... మంగళవారం మంత్రి పర్యటన సందర్భంగా ఆగమేఘాల మీద చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. మంత్రులు, ఉన్నతాధికారులు వస్తున్నారన్న సమాచారంతో చెత్తనివారణ, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. మామూలు రోజుల్లో వివిధ రోగాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, మున్సిపల్ అధికారులకు కనిపించలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనంతరం మంత్రి పర్యటన వాయిదా పడిందనే సమాచారంతో పనులు సగానికే వదిలేసి మున్సిపల్ సిబ్బంది వెళ్లిపోయారు.

బీఆర్ఎస్ హయాంలో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్,ఆదిబట్ల, మున్సిపాలిటీల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సేవలందించింది. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మంగళవారం ఆస్పత్రిలో ఆరోగ్య శాఖ మంత్రి పర్యటిస్తున్నారన్న సమాచారంతో ఆగమేఘాల మీద మున్సిపల్ అధికారులు, దవాఖానా సిబ్బంది ఆస్పత్రి ఆవరణలో నెలల తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ఉదయం 4గంటల నుంచే పనులు ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు ఆస్పత్రి ఆవరణలను శుభ్రం చేసి మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్లు, ఆటోల ద్వారా ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలించేవారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఒక ప్పుడు ఎంతో మంది రోగులకు ఉత్తమ సేవలందించిన ఈ ఆస్పత్రి నేడు పనికి రాకుండా పోయిందని, ఇక్కడికి రోగాలతోవచ్చినా పట్టించుకోవడం లేదని పేదలు, రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలోని పేదప్రజలకు సరైన సేవలందించేందుకు ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఫార్మా భూ బాధితులకు అండగా ఉంటాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- మేడిపల్లిలో పర్యటన
- బాధిత రైతులతో సమావేశం

మేడిపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం, మార్చి 4: ఫార్మా భూ బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఎం పార్టీ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఫార్మా బాధిత రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆమోదం లేకుండా ఫార్మా ఏర్పాటు కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేశామని చెప్పి తీరా గద్దెనెక్కాకా రైతులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కోర్టులో ఫార్మాకు అనుకూలమని చెప్పి రైతులకు మాత్రం ఫార్మాను రద్దు చేశామని మోసపూరిత మాటలతో రైతులను ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఫార్మాసిటీని నిజంగా రద్దు చేస్తే అధికారికంగా జీవో విడుదల చేయాలన్నారు. ఫార్మాకు బదులుగా ఫోర్త్‌సిటీ, ఏఐసిటీ, ఫ్యూచర్‌సిటీ అంటూ పూటకో మాట మాట్లాడుతూ రైతులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఫార్మాకు భూములిచ్చిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, ఎకరాకు 121గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి, నేటికి ఇంటికో ఉద్యోగం ఊసేలేదని, ఇంటి స్థలాల ప్లాటు సర్టిఫికెట్లు పెట్టెలో మూలుగుతున్నాయని ఎద్దేవా చేశారు. ఫార్మాకు ఇవ్వని 2200ల ఎకరాలకు సంబందించిన భూములకు సంబందించి టీఎస్ఐఐసీ పేరును తొలగించి తిరిగి రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. ఈ రైతులకు రైతు భరోసా, రైతుబీమా, పంటరుణం అందించాలని, భూమిని అమ్ముకోవడానికి వీలుగా రిజిస్ట్రేషన్ అయ్యేలా వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు.

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పందించకుంటే యాచారం నుంచి రైతులతో పాదయాత్రగా వెళ్లి సీఎం ఇంటిని ముట్టడిస్తామని జాన్‌వెస్లీ అన్నారు. ఫార్మా గ్రామాల్లో పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాజీనామా చేయాల్సింది తన మంత్రి పదవి కోసం కాదని నమ్మి ఓట్లేసిన రైతులకు న్యాయం జరిగేందుకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంతో రైతుల తరపున పాదయాత్ర చేసిన కాంగ్రెస్ నేతలు పార్టీ అధికారంలోకి వచ్చి తమకు పదవులు రాగానే రైతులను విస్మరించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ నాయకులు మాటమీద నిలబడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, రైతు సంఘం జిల్లాకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీపీఎం నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, పెద్దయ్య, జగన్, భూషన్, జంగయ్య, సత్తయ్య, యాదయ్య, లాజర్ ఫార్మా వ్యతిరేఖ పోరాట కమిటీ సభ్యులు గణేష్, అచ్చిరెడ్డి, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

బడిలో బొట్టు పంచాయితీ

పెద్దఅంబర్‌పేటలోని ప్రైవేటు స్కూల్‌లో ఆందోళన

పెద్దఅంబర్‌పేట, మార్చి 4: బొట్టు పెట్టుకుని పాఠశాలకు వచ్చాడని విద్యార్థినిని ప్రిన్సిపాల్ చితకొట్టాడు. పెద్దఅంబర్‌పేటలోని క్యాండర్ ఫ్లైన్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన మంగళవారం ఆందోళనకు దారితీసింది. పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి ఎప్పటిలాగే సోమవారం పాఠశాలకు వెళ్లాడు. ఉదయం ప్రతిజ్ఞ పూర్తికాగానే.. బొట్టు ఎందుకు పెట్టుకొచ్చావం టూ ప్రిన్సిపాల్ లక్ష్మయ్య విద్యార్థిని నిలదీశాడు. ఆపై చితకబాదాడు. బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి బొట్టు పోయేలా ముఖం కడిగించాడు. స్కూల్‌నుంచి ఇంటికి వెళ్లాక విద్యార్థి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. విద్యార్థి తల్లిదండ్రులతోపాటు హిందూవాహిని సభ్యులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. బొట్టు పెట్టుకున్నాడనే కారణంతో విద్యార్థిని ఎలా కొడతారని నిలదీశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ వచ్చే వరకు ఆందోళన ఆపేదిలేదని పాఠశాల ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ఘటనపై స్పందించిన పాఠశాల యాజమాన్యం విద్యార్థిపై చేయిచేసుకున్న స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది. మరోసారి ఈ తరహా ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, హిందూ వాహిని సభ్యులు హెచ్చరించారు.

పాఠశాల ప్రతినిధులను నిలదీస్తున్న హిందూవాహిని సభ్యులు

అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధి, సంక్షేమంలో ప్రభుత్వం విఫలం

ఆర్కే పురం, మార్చి 4: అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన పరిధిలోని హుడా కాంప్లెక్స్,